# పేదరికంపై పాశుపతాస్త్రం

# నాగేంద్ర రెడ్డి



- చిరుప్రాయం నుండి వెంటాడిన కష్టాలు, కడగండ్లు
- అమ్మానాన్నల వేదన కండ్లారా చూసిన విజ్ఞాన మహర్షి
- అసమాన ప్రతిభతో గ్రూప్ వన్‌లో మెరిసిన నాగేంద్రుడు
- రాయలసీమలో పుట్టినా.. తెలంగాణ గడ్డకు సేవలందిస్తున్న ఉత్తమ అధికారి..
- నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ గండ్లూరు నాగేంద్ర రెడ్డి

## సొంతిల్లు లేని స్థితి నుంచి ఐఏఎస్ టాపర్‌గా ఎదిగిన ప్రస్థానం






వనం నాగయ్య, కెరటం న్యూస్

### ఆయన ఆలోచనలు తొలకరి జల్లంత స్వచ్ఛమైనవి..

మల్లెపూల పరిమళమంత మృధువైనవి.. ఆయన ఆశయం ఎవరెస్టు శిఖరమంత.. ఆయన పట్టుదల దేదీప్యమానంగా వెలిగే దివ్యదీపం.. ఆయన లక్ష్యం ఎల్లలు లేనిది.. ఆయన మనసు పొరల్లో అంతర్లీనంగా దాగున్న గమ్యం ఉషోదయాన వీచే సుప్రభాత పరిమళంలాంటిది.. ఒక వైపు పేదరికం వికటాట్టహాసం చేస్తున్నా.. ఏమాత్రం చలించిపోకుండా మనసును చదువు పై లగ్నం చేసి.. సెంటు భూమి కాదు కదా సొంతిల్లు కూడా లేని స్థితి నుండి ఏకంగా గ్రూప్ వన్ టాపర్‌గా విజయకేతనం ఎగురవేసిన విజ్ఞాన మహర్షి.. అందుకే పేదరికం అనే జీవి త సుడిగుండంలో చిక్కు కున్న ఎందరికో ఆయన జీవితం ఈ రోజుల్లో ఒక ఆదర్శం.. సరికొత్త ఆశలకు ఎల్లలు ఎరుగని సంకల్పానికి ఎన్నటికీ చెరిగిపోని సుదీర్ఘ సంతకం ఆయన.. ఇంతకూ ఆయనెవరనేగా మీ సందేహం.. పౌరుషాగ్నికి కేరాఫ్‌గా చెప్పుకునే రాయలసీమలోని కడప జిల్లాలో పుట్టిపెరిగినా తన అసమాన ప్రతిభతో గ్రూప్‌వన్ టాపర్‌గా నిలిచి తెలంగాణ గడ్డకు విశిష్ట సేవలు అందిస్తున్న ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ గండ్లూరు నాగేం ద్ర రెడ్డి. పైకి కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపాల్కెతే కనిపించని ఆ నాలుగో సింహమేరా పోలీస్ అని విలక్షణ నటుడు సాయికుమార్ నోటినుండి పలుకు ఎలా బాణంలా దూసుకొస్తుందో విధి నిర్వహణలోనూ సరిగ్గా అలాగే నానాటికీ పెచ్చరిల్లు తున్న గంజాయి రవాణా, గుడుంబా రవాణాపై ఉక్కు పాదం మోపుతూ తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న మత్తు రహిత తెలం గాణగా రూపుదిద్దడంలో తనవంతుగా జిల్లా ఎక్సైజ్ శాఖకు సుపీరియర్ అధికారిగా ప్రభుత్వ మన్ననలు అందుకుంటున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ (ఈఎస్) నాగేంద్ర రెడ్డి సక్సెస్ జర్నీపై కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం...

మిగతా 7వ పేజీలో..

తల్లిదండ్రులతో నాగేంద్ర రెడ్డి గారు







ఐఏఎస్ ప్రిపరేషన్ సమయంలో ఢిల్లీలో మిత్రులతో.. పక్క చిత్రంలో నాగేంద్ర రెడ్డి ఫ్యామిలీ



# పేదరికంపై పాశుపతాస్త్రం ఈఎస్ నాగేంద్ర రెడ్డి

## కష్టాలకు పుట్టిల్లుగా ప్రస్థానం ఆరంభించి...

కడప జిల్లా పొద్దుటూరులో ఓ ప్రయివేటు ఆఫీసులో సాధారణ ఎకౌంటెంట్‌గా చిరుద్యోగం చేసుకుంటున్న గండ్లూరు వెంకటరెడ్డి, లక్ష్మీకాంతమ్మ దంపతుల ఇద్దరు సంతానంలో పెద్దమ్మాయి తులసి కాగా, రెండో సంతానం నాగేంద్ర రెడ్డి. సెంటు భూమిలేదు, కనీసం ఉండటానికి ఇల్లు కూడాలేని పేద కుటుంబం వారిది. ఎకౌంటెంట్‌గా పొద్దంతా పనిచేస్తే వచ్చే నెలవారీ జీతంతో అన్నింటినీ సర్దుకుని ఉన్నదాంట్లోనే తృప్తి పడుతూ జీవనం సాగిస్తున్నారు. పగలంతా ఎకౌంటెంట్‌గా లెక్కల పుస్తకాలు రాసే వెంకటరెడ్డి తన కుటుంబ ఆర్దిక పరిస్థితులు గురించి రాత్రంతా ఆలోచించేవాడు. తన ఒక్కడి కష్టంతో ఎన్నాళ్లు కుటుంబాన్ని నెట్టుకురావాలో ఆలోచిస్తే ఒక్కోసారి గుండె బరువెక్కేది. చిన్నప్పుడే చాలా తెలివిగా కనిపిస్తున్న తన కొడుకును చదివించాలన్నా కనీసం పాఠశాలకు పంపాలన్నా మనసుకు భారంగా అనిపించేది. అయినా వెంకటరెడ్డి ఒక కఠిన నిర్ణయానికి వచ్చాడు. తాను పడ్డ కష్టాలు తన కొడుకు, కూతురు పడకూడదని భావించాడు. అవసరమైతే అదనంగా వేరే పనిచేసి అయినా ఇద్దరు పిల్లలను చదివించాలని నిర్ణయించాడు. ఇద్దరు పిల్లలను స్థానికంగా పొద్దుటూరులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పాడు. పగలూ రాత్రీ తేడా లేకుండా తల్లిదండ్రులు పడుతున్న అష్ట కష్టాలను అక్కా తమ్ముడు కూడా తోటి పిల్లల్లా ఆషామాషీగా కాకుండా కష్టపడి, ఇష్టపడి చదవాలని నిర్ణయించుకున్నారు. బడిలో చేరిన ఒకటో తరగతి నుండే ఇద్దరు పిల్లలూ తోటి విద్యార్థులకంటే ఎక్కువ ప్రతిభ కనబర్చి తమ సుదీర్ఘ లక్ష్యం వైపు అడుగులు వేశారు.

## దీపావళి వెలుగులకూ దూరమైన బాల్యం..

చిన్నప్పుడు కష్టాలే చుట్టాలుగా ఎదిగిన నాగేంద్రరెడ్డి చిన్నప్పుడు దీపావళి పండుగ రోజున తోటి స్నేహితులంతా టపాసులు కాల్చుతున్నా అవి కొనలేని స్థితిలో దీపావళి వెలుగులకు దూరమైపోయేవారు. కొన్నాళ్లు దీపావళి బాంబులు కాల్చాలని కుతూహలం ఉన్నా ప్రతీ ఏడాదీ అవి కొనే స్తోమత లేక వచ్చే ఏడాది కాల్చకుందామని వాయిదాలు వేసుకుంటూ వచ్చేవాడు. ఇలా కొన్నాళ్లు వాయిదా వేసి ఇక అదే అలవాట్నై దీపావళి పండుగ ఆనందాలకు దూరమైపోయామని నేటికీ నాగేంద్ర రెడ్డి మనసులో మెదిలినప్పుడల్లా ఆవేదనకు గురవుతూ ఉంటారు. అందుకే ప్రపంచంలో పేదరికాన్ని పారదో లే ఏకైక వజ్రాయుధం చదువేనని పలికిన దక్షిణా ఫ్రికా నల్లసూరీడు నెల్సన్ మండేలా చెప్పిన మాటల ను, బంగారు భవిష్యత్తును పొందేందుకు కలలు కనం డి.. వాటిని సాకారం చేసుకోం డని యువతకు పిలుపునిచ్చిన మిస్సైల్ మ్యాన్, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మాటలను మదిలో ఉంచుకుని అమ్మానాన్నల ఆశలను నిలబెడుతూ ప్రతీ దశలోనూ తన మార్కును చాటుకుం టూ నాగేంద్ర రెడ్డి ముందుకు సాగారు.



ఇంటర్‌లో పుస్తకాలు కొనిచ్చిన మిత్రుడు సుందర్

## నాన్నా కండ్లల్లో ఆనందం చూసిన క్షణాలు నేటికీ కండ్ల ముందు కదలాడతాయి...

పేదరికాన్ని జయించాలంటే చదువొక్కటే మార్గమని భావించిన నాగేంద్రరెడ్డి ఎల్లలు లేని తన సంకల్పానికి తొలి నుండే శ్రీకారం చుట్టారు. తరగతి ఏదైనా, పరీక్ష మరేదైనా వీరి తరగతుల్లో వీరిదే పై చేయిగా పరిస్థితులు మార్చుకున్నారు. ఈ క్రమంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నాగేంద్ర రెడ్డి ప్రథమ శ్రేణిలో అత్యుత్తమ మార్కులతో పాస్ కావడంతో ఆ కుటుంబంలో తొలి సంబరానికి వేదికైంది. నూనూగు మీసాల వయసులో ఉన్న నాగేంద్ర రెడ్డి ఎలాంటి కార్పొరేట్ స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ లేకుండానే సాధించిన అత్యుత్తమ ఆర్కులు చూసి తన తండ్రి వెంకటరెడ్డి కొడుకును గుండెలకు హత్తుకుని బుగ్గలపై ముద్దాడిన మరుపురాని క్షణాలు నేటికీ నాగేంద్ర రెడ్డి నెమరువేసుకుంటారు. నాన్న కండ్లల్లో ఆనందం చూసిన ఆ బాలుడు ఇక మరింత ఉన్నత లక్ష్యంవైపు తన గురిపెట్టాడు. ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ చదవాలన్న ఆశ ఉన్నప్పటికీ కనీసం పుస్తకాలకు, ఫీజులు, ల్యాబ్, తదితర ఖర్చులకు కూడా డబ్బులు చెల్లించడానికి తన తండ్రి వద్ద డబ్బుల్లేని ఆర్థిక స్థితిని గుర్తు చేసుకుని తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఎలాంటి ఖర్చులూ లేని విధంగా ఇంటర్ చదివేలా సీఈసీలో జూనియర్ కాలేజీలో చేరాడు. అమ్మానాన్నల కష్టాలు నిత్యం మదిలో మెదులుతున్నా, కుటుంబ ఆర్థిక పరిస్థితులు వెంటాడుతున్నా దృఢ సంకల్పంతో ఇంటర్ విద్యపై దృష్టి సారించాడు. కుటుంబ కష్టాలు వెంటాడుతున్నా..నాగేంద్ర రెడ్డి కండ్లముందు మాత్రం అత్యుత్తమ మార్కులు సాధించాలన్న ఒకటే లక్ష్యం కదలాడుతోంది. కాలచక్రం గిర్రున తిరిగింది. ఇంటర్ పరీక్షల సమయం రానే వచ్చింది. ఏడాదంతా ఒక ఆశయంతో చదివిన నాగేంద్ర ఇంటర్ మొదటి ఏడాది పరీక్షల్లో ఏకంగా జిల్లాలో అత్యుత్తమ మార్కులు సాధించాడు. ఏకంగా కడప జిల్లా మొదటి ర్యాంకును సాధించాడు. అదే లక్ష్యం, క్రమశిక్షనతో ఇంటర్ రెండో ఏడాది పరీక్షల్లోనూ మరో మారు తన జైత్రయాత్ర కొనసాగిస్తూ కడప జిల్లాలో రెండో ర్యాంకు సాధించి అందరి దృష్టిని తనవైపు మళ్లించాడు. అమ్మానాన్నల కష్టానికి తన ర్యాంకును బహుమతిగా ఇచ్చాడు.

## పేదరికంలో తోడుగా నిలిచిన సోపతి సుందర్...

పేగు బంధం కాకున్నా, రక్త సంబంధం అంతకన్నా కాకున్నా స్నేహబంధంతో దగ్గరైన తన ఇంటర్‌మీడియట్ క్లాస్‌మేట్ సుందర్ అనే సోపతి రూపంలో నాగేంద్ర రెడ్డి కష్టాలకు తోడు దొరికింది. నాగేంద్ర రెడ్డిలో ఉన్న అసమాన ప్రతిభాపాటవాలు గుర్తించి స్నేహితుడు సుందర్ తన దగ్గర ఉన్న అనేక కాంపిటీటివ్ పుస్తకాలు బహుమతిగా ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగంకోసం సిద్ధపడాలని దారి చూపాడు. అప్పటికే తండ్రి పడుతున్న ఇబ్బందులను ప్రతీ క్షణం గుర్తుచేసుకుంటున్న నాగేంద్ర ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆలోచనతో సుందర్ ఇచ్చిన పుస్తకాలతో కుస్తీపట్టేవాడు. ఈ క్రమంలోనే ఇంటర్ పూర్తయిన తరువాత పెద్ద చదువకు సీఏ, సీఎస్ చదవాలన్నా ఆర్థిక పరిస్థితులు సరిగాలేవు. సీఏ, సీఎస్ చదవాలంటే డబ్బులు చెల్లించాల్సి వస్తుందన్న ఆలోచనతో రాజీ పడి 2002లో హైదరాబాద్‌లోని భద్రుకా కాలేజీలో బీకాంలో చేరాడు. 2005లో బీకాంను అత్యుత్తమ మార్కులతో పూర్తిచేశాడు. ఒక వైపు చదువుతూనే మరో వైపు స్నేహితుడు ఇచ్చిన కాంపిటీటివ్ పుస్తకాలు చదివి తన తొలి ప్రయత్నంలోనే తన అసమాన ప్రతిభతో ఏకంగా మల్టీనేషనల్ కంపెనీలో కార్పొరేట్ ఉద్యోగం సాధించాడు. 2005లో ఉద్యోగానికి ఎంపికైన నాగేంద్రకు నెలకు రూ.20వేల వేతనంతో జాబ్ వచ్చింది. కానీ ఏదో ఒక వెలితి ఆయనలో వెంటాడుతుండేది. తాను సాధించాల్సింది ఇది కాదు ఇంకేదో ఉందని తలుచుకుంటూ ఉండే వాడు. సరిగ్గా అదే సమయంలో రెడ్డి హాస్టల్లో ఉంటూ తాను బీకాం చదువుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వేళ ప్రభాకర్ రెడ్డి అనే సార్ నాగేంద్ర రెడ్డిలోని ప్రతిభను గుర్తించి అండగా నిలిచాడు. కార్పొరేట్ కంపెనీలో వచ్చిన రూ.20వేల ఉద్యోగాన్ని వద్దని వారించి అసల్కైన లక్ష్యం వైపు వెళ్లాలని ప్రభాకరరెడ్డి మార్గదర్శిలా దారి చూపాడు.

## ప్రభాకర్‌రెడ్డి సార్ అండతో దేశ రాజధానికి పయనం...

నాగేంద్ర రెడ్డిలో దాగున్న విజ్ఞానాన్ని గుర్తించిన ప్రభాకరరెడ్డి సార్ గ్రూప్ వన్ సాధించగలడన్న నమ్మకం కుదిరింది. విద్యార్థి ప్రతిభా పాటవాలను గురించి ఉన్నత చదువులు చదవడానికి ఎదురౌతున్న ఆర్థిక ఇబ్బందులను గురించి కొంతమంది స్పాన్సర్లకు తెలియజేసి ఒప్పించాడు. ఫలితంగా నాగేంద్ర ఢిల్లీలోని ఐఏఎస్ కోచింగ్‌కు వెళ్లడానికి ఆర్థిక ఇబ్బందులు కొంత వరకు తొలగిపోయాయి. ఐఏఎస్‌కు ప్రిపేర్ అవుతూనే ఒకసారి బ్యాంకు క్లర్క్ ఉద్యోగానికి పరీక్ష రాయగానే టాప్ మార్కులు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కానీ ఇదికూడా కాదనీ, ఐఏఎస్ లక్ష్యంగా ముందుకు కదిలాడు. ఈ క్రమంలోనే 2010లో మరో మారు కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే సీజీఎల్( కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్)లో ఎన్‌ఎస్‌ఎస్‌ఓ( నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్)లో నాన్ గెజిటెడ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో 11నెలలు పనిచేశాడు. ఆ సమయంలోనే హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ జర్నలిజం కాలేజీలో జర్నలిజం కోర్సులో ఎంసీజే టాప్ మార్కులతో పూర్తిచేశాడు.

## గ్రూప్ వన్‌లో స్టేట్ ర్యాంకు...

అప్పటికే కేంద్ర ప్రభుత్వ కొలువులో ఉన్న నాగేంద్రరెడ్డి తన గురువు ప్రభాకరరెడ్డి చూపిన అసలు లక్ష్యం గ్రూప్‌లో జాబ్ సాధించి ఐఏఎస్ కావాలన్న ఆశయం కండ్ల ముందుకు రానే వచ్చింది. 2012లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో గ్రూప్ వన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షలకు హాజరై ఏకంగా ఉమ్మడి ఏపీలో ఓవరాల్‌గా 33వ ర్యాంకు సాధించడమే కాకుండ, తన తోటి బ్యాచ్ ఎక్సైజ్ శాఖకు ఎంపికైన 14 మందిలో బ్యాచ్ టాపర్‌గా నిలిచి యావత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తన కీర్తి పతాకాన్ని రెపరెపలాడిరచాడు. తొలి పోస్టు 2013లో నిజామాబాద్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించగా, 2016లో హైదరాబాద్‌లోని స్టేట్ టాస్క్ ఫోర్స్‌లో ఒక ఏడాది పనిచేశారు. 2017లో సివిల్ సప్లై శాఖలో డిప్యూటేషన్‌పై జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. అనంతరం 2022లో తమ మాతృసంస్థ ఎక్సైజ్ శాఖకు బదిలీ అయి స్టేట్ టాస్క్ ఫోర్స్‌లో రెండు నెలలు పనిచేశారు. తర్వాత 2022 ఏప్రిల్‌లో ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం ఈఎస్‌గా, జిల్లా ఎక్సైజ్ శాఖకు ఉన్నతాధికారిగా పనిచేస్తున్న గండ్లూరు నాగేంద్ర రెడ్డి సతీమణి రూప కూడా ఐఏఎస్ ప్రిపరేషన్‌లో ఉన్నారు. వీరికి తన్విక, బృహద అనే ఇద్దరు ముద్దుల కూతుళ్లున్నారు. ఇదిలా ఉండగా చదువుల్లో మేటిగా చిన్ననాటి నుండే రాణించి 'పూలల్లో సువాసన, మనుషుల్లో యోగ్యత దాచినా దాగవు..'అని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పినట్టుగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా నాగేంద్ర రెడ్డి వ్యాసరచనలో, పాటలు పాడటంతో గాయకునిగా, మంచి వాగ్దాటి కలిగిన వక్తగా, వ్యాసకర్తగా, జర్నలిస్టుగా, నాటికలు రాసి, వాటిలో నటించడంలోనూ ప్రతిభ కలిగి ఉన్నారు. ఇంటర్ వరకూ ఈ రంగాల్లో అన్నింటిలోనూ నాగేంద్ర రెడ్డికి అనేక బహుమతులు, పురస్కారాలు అందుకుని తనలోని మరో నైపుణ్యానికి రంగులు అద్దారు. తన ప్రస్థానంలో అన్నింటా విజేతగా నిలిచి పేదింట వికసించిన విద్యా కుసుమంలా, అమ్మానాన్న చెక్కిన అద్భుతమైన శిల్పలా రూపు దిద్దుకుని యూత్‌కు ఐకాన్‌లా మరెన్నో లక్ష్యాలు సాధించే దిశగా నాగేంద్ర రెడ్డి ముందుకు సాగుతున్నారు.



గ్రూప్1 ప్రిపరేషన్‌కి ఢిల్లీ వెళ్లేందుకు స్పాన్సర్‌లతో ఒప్పించి ఆర్థిక సాయం అందించిన ప్రభాకర్ రెడ్డి గారు